అన్నీ తడిచిపోయాయి

నా పేరు వై.రోశిరెడ్డి. ముఠా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. ఇంట్లో బియ్యం, బట్టలు అన్నీ తడిచిపోయాయి. నాలుగు రోజుల నుంచి తాగడానికి నీరు కూడా లేదు. అపార్ట్‌మెంట్‌లో ఉన్న వారికి ఆహారపొట్లాలు ఇచ్చి కింద ఉన్నవారిని ఎవరూ పట్టించుకోలేదు

–వై.రోశిరెడ్డి, సింగ్‌నగర్

భోజనం ప్యాకెట్లు అందలేదు

నాపేరు వై.మేరి. మా అబ్బాయి రమేష్‌బాబుకు కాలు విరిగింది. ఆహార పొట్లాలు విసిరేస్తున్నారు. అవి నీటిలో పడిపోతున్నాయి. మూడు రోజులుగా ఒక భోజనం ప్యాకెట్ కూడా మాకు అందలేదు. గత్యంతరం లేక సింగ్‌నగర్ వదిలి బయటకు వెళ్తున్నాం.

–వై.మేరి, సింగ్‌నగర్

ప్రభుత్వం పట్టించుకోలేదు

నా పేరు వై.శ్రీను. నాకున్న ఒక్క గదిలోకి నీరు వచ్చేసింది. శ్లాబ్ పైన ఉంటున్నా. భోజనం, తాగునీరు అన్నింటికీ ఇబ్బందిగా ఉంది. మా వార్డులో యువకులు వచ్చి పులిహోర, తాగునీరు ఇచ్చారు. ప్రభుత్వం పట్టించుకోకపోతే ఎలా.

–శ్రీను, సింగ్‌నగర్ కాలనీ

మూడు రోజులు నరక యాతన అనుభవించాం

ఇంట్లోకి వరద నీరు వచ్చింది. మేము అనారోగ్యంతో బాధపడుతున్నాం. బయటకు వెళ్లే పరిస్థితి లేదు. ఇంట్లోనే మూడు రోజులు నరక యాతన అనుభవించాం. మూడో రోజు ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది వచ్చి మమ్మల్ని బయటకు తీసుకువచ్చారు.

–లక్ష్మీప్రసన్న, నాగవరప్రసాద్, ఇందిరానగర్, 52వ డివిజన్, విజయవాడ








వేదన.. తీరేనా..?


బాధితులకు జగనన్న పరామర్శ





బెజవాడ నగర వాసులు ఇంకా ముంపు ముప్పులోనే ఉన్నారు. ఎటుచూసినా వరద నీరే దర్శనమిస్తోంది. వరద ఇక్కట్లతో జనం మనోవేదన అనుభవిస్తున్నారు. నాలుగు రోజులైనా ఇళ్లతో పాటు రహదారులపై నీళ్లు తగ్గలేదు. కొన్ని ప్రాంతాల్లో కొద్ది మేర నీళ్లు తగ్గాయి. ఇటువంటి చోట్ల ఇళ్లలో పేరుకుపోయిన మురుగు తొలగించుకుంటున్నారు. సామాన్లు శుభ్రం చేసుకునేందుకు నానా ప్రయాసలు పడుతున్నారు. బాధితులు తిండీ, తిప్పలు లేక విలవిల్లాడిపోతున్నారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలు, బాలింతలు, గర్భిణుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ముంపులో పూర్తిగా దెబ్బతిన్న తమ గోడు అధికారులు ఏ మాత్రం పట్టించుకోలేదని పలువురు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేలాది మంది నగరాన్ని విడిచిపెట్టి వెళుతున్నారు. భయానక వరదల్లో చిక్కుకొని అనేక విధాలుగా నష్టపోయి ముంపు నుంచి అతికష్టం మీద బయటపడి ఇతర ప్రాంతాలకు పయనమవుతున్నారు. బ్యాగులు, సంచులు, పెట్టెలు సర్దుకొని పిల్లా జెల్లా, వృద్ధులతో సహా పెద్ద సంఖ్యలో కుటుంబాలు తమ బంధువులు, స్నేహితులు, తెలిసిన వారి వద్దకు వేదనతో వెళ్లిపోతున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్లు, విజయవాడ




బాధితులకు ఆపన్న హస్తం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):కనీవినీ ఎరుగని రీతిలో వరద నగరాన్ని ముంచెత్తింది. బుడమేరు వరదకు అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతం పూర్తిగా ముంపునకు గురైంది. వరదకు 58వ డివిజన్ పరిధిలోని నందమూరి నగర్, ఇందిరానాయక్ నగర్ కాలనీ, భరతమాత కాలనీ, సన్‌సిటీకాలనీ పూర్తిగా నీటమునిగాయి. ఆ దృశ్యాలు చూసి డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి చలించిపోయారు. బుడమేరు నుంచి వరద వచ్చిన తొలిరోజే హుటాహుటిన స్పందించి డివిజన్‌లోని 2వేల మందికి ఆహారం తయారు చేయించి పొట్లాలు పంపిణీ చేశారు. పొక్లెయిన్‌ల సహాయంతో బుడమేరు పరివాహక ప్రాంతాల్లోని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మూడు రోజులుగా నడుముల లోతు నీటిలోనే ముంపు ప్రాంతాల్లో కలియ తిరుగుతున్నారు. బాధితులతో స్వయంగా మాట్లాడి వారికి కావాల్సిన తాగునీరు, ఆహారం పంపిణీ చేశారు. డివిజన్‌లోని మహిళలను కలుసుకుని వారిని ఓదార్చారు. ధైర్యం చెప్పి ఆహారం అందించారు. వరద నీటిలో చిక్కుకున్న వారి సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అవసరమైన సహాయ, సహకారాలు అందించారు. వరదలో వెళ్లలేని ప్రాంతాలకు సైతం ట్రాక్టర్ వెళ్లి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఇందిరానాయక్ నగర్‌కు వరద రావడంతో ఓ ఇంట్లో తల్లి కూతుళ్లు నీటిలో చిక్కుకున్నారు. వారి నుంచి ఫోన్ రావడంతో హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకుని పొక్లెయిన్ సాయంతో ఆ ఇద్దరినీ సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి కూడా ఇందిరానాయక్ నగర్ కాలనీలోనే ఉండడంతో ఇంటికి వచ్చిన ముంపు బాధితులకు పాల ప్యాకెట్లు, బిస్కెట్లు, ఇతర సామగ్రి అందించారు. సొంతంగా ఉన్న మూడు ట్రాక్టర్లు, జేసీబీని మూడు రోజులు సహాయక చర్యలకు వినియోగిస్తూ ఆపన్న హస్తం అందిస్తున్నారు. వరద తీసిన ప్రాంతాల్లో బ్రెడ్, పాలు అందించారు. సహాయక చర్యల్లో డెప్యూటీ మేయర్ భర్త, వైఎస్సార్ సీపీ నాయకుడు అవుతు శ్రీనివాసరెడ్డి మూడు రోజులుగా సేవలు అందిస్తున్నారు. తమ డివిజన్ వాసుల కష్టాలు తమవిగా భావించి డెప్యూటీ మేయర్ కుటుంబం అహర్నిశలు శ్రమిస్తున్నారు. అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంతోపాటు నగరాన్ని వరద కోలుకోలేని దెబ్బతీసిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.


వరద నీటిలో తిరుగుతూ డివిజన్ వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న శైలజ


వరద బాధితులకు ఆహార పదార్థాలు పంపిణీ చేస్తున్న కరూర్ వైశ్యా బ్యాంకు ప్రతినిధులు

వరద బాధితులకు అన్నదమ్ముల సాయం...

భవానీపురం(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద బాధితులకు విద్యావంతులైన అన్నదమ్ములు ఆపన్న హస్తం అందించి అండగా నిలిచారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ కుమార్ తనయులు రాజ్‌కుమార్(డాక్టర్), విజయకుమార్(ఇంజినీర్) బుధవారం ఊర్మిళానగర్, రెడ్డికాలనీ, ఏకలవ్యనగర్, జోజినగర్, కబేళా సెంటర్ ప్రాంతాల్లో ట్రాక్టర్‌లో పర్యటించి వరద బాధితులకు భోజనం ప్యాకెట్లు, మంచి నీరు, పాలు, బిస్కెట్లు తదితర ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కడపడితే అక్కడ పంపిణీ చేయకుండా వరద ముంపులో ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించి, వారికి అవసరమైన ఆహారాన్ని అందజేస్తున్నామని చెప్పారు.


బాధితులకు ఆహారం, పాలు, నీరు అందజేస్తున్న రాజ్‌కుమార్, విజయ్‌కుమార్ బృందం

ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఇబ్బందులు పడే ఆపన్నులను ఆదుకోవడం సామాజిక బాధ్యతగా భావించే తండ్రి ఆకుల శ్రీనివాస్ కుమార్ నుంచి స్ఫూర్తి పొందిన తాము రెండు రోజుల నుంచి ఏరియాల వారీగా నాలుగు ట్రాక్టర్ల ద్వారా సాయం చేస్తున్నామని చెప్పారు. తమ తండ్రి ఆకుల శ్రీనివాస్ కుమార్ భవానీపురంలోని తన నివాసం వద్ద వరద బాధితులకు భోజనం ఏర్పాట్లు చేస్తున్నారని చెప్పారు. తాము అందిస్తున్న సేవల్లో ఎ.సూర్య, బాషా, ఖాజా, రవీంద్ర, ఫణీంద్ర, వినయ్ తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

వరద బాధితులకు కరూర్ వైశ్యా బ్యాంక్ వితరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): కరూర్ వైశ్యా బ్యాంక్ డివిజనల్ ఆఫీస్ ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గం గట్టు వెనుక ప్రాంతాలైన భవానీపురం, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్, హౌసింగ్ బోర్డ్ కాలనీలోని సుమారు 500 వరద బాధితుల కుటుంబాలకు ఆహారం, పాలు, బ్రెడ్, బిస్కెట్లు, తాగునీరు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ డివిజనల్ హెడ్ కేవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ బ్యాంక్ సామాజిక బాధ్యతల్లో భాగంగా రెండు రోజుల నుంచి రోజుకు 500 కుటుంబాల చొప్పున ఆహార పదార్థాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీబీయూ క్లస్టర్ హెడ్ ఎస్.మురళీకృష్ణ, సీబీయూ హెడ్ ఎస్.వెంకట సుబ్బయ్య, డివిజనల్ చీఫ్ మేనేజర్ ఐవీ సుబ్రహ్మణ్యం శెట్టి, డివిజనల్ ఆఫీస్ స్టాఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

సాధ్యమైనంత త్వరగా ఉత్పత్తి ప్రారంభించాలి

విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ది కృష్ణా మిల్క్ యూనియన్(విజయ డెయిరీ)లో సాధ్యమైనంత త్వరగా పాలు, పాల ఉత్పత్తుల ప్యాకింగ్ తిరిగి అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. వరద ప్రభావంతో ముంపునకు గురైన పాల ప్రాజెక్టును బుధవారం సాంకేతిక అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. ప్రాజెక్టులోని విద్యుత్ వ్యవస్థ, మిషనరీని పరిశీలించిన అనంతరం సాంకేతిక అధికారులతో మాట్లాడారు. మరో రెండు రోజుల్లో వరద నీరు పూర్తిగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు. వరద తగ్గిన వెంటనే మిషనరీ మరమ్మతులు, ఇతర అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. పాల ఉత్పత్తుల ప్యాకింగ్, స్టోరేజీ పాయింట్‌తో పాటు పరిపాలనా భవనాన్ని పరిశీలించారు. వరద వీడిన వెంటనే ఫ్యాక్టరీలో ఉత్పత్తి ప్రారంభించేలా అందరూ కృషి చేయాలని ఆయన సూచించారు.

ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది

వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్


పాలు, మంచినీరు పంపిణీ చేస్తున్న షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలోని వరద బాధితులకు సాయం అందించటంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. పార్టీ పక్షాన నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో వరద బాధిత కుటుంబాలకు పాలు, మంచినీరు పంపిణీ కార్యక్రమాన్ని ఆసిఫ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బుడమేరు వరద నేపథ్యంలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయన్నారు. వరదల నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయటం, వారికి సాయం చేయటంలో ప్రభుత్వం తన అసమర్థతను చాటుకుందన్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నగరంలో ఉండి తిరుగుతున్నా ఎక్కడా ప్రజలకు మేలు జరగలేదన్నారు. కేవలం మీడియా ముందు హడావుడి తప్ప వాస్తవ రూపంలో ఎక్కడా ప్రజలకు న్యాయం జరగటం లేదన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి సూచనలు చేస్తుంటే వాటిపై చంద్రబాబు విమర్శలు చేయటం విడ్డూరంగా ఉందన్నారు. అధికారులు పని చేయటం లేదంటూ ముఖ్యమంత్రే ఓ పక్క చెబుతూ మరోవైపు ప్రతిపక్షాన్ని విమర్శించటం సిగ్గుచేటన్నారు. జగనన్న కోటి రూపాయల సాయంతో పాటుగా పార్టీ శ్రేణులంతా ప్రజలకు సాయమందించటంలో ముందు భాగాన ఉన్నారని చెప్పారు. కార్పొరేటర్ యలకల చలపతి రావు, వినోద్, బాజీబాబా, కరీమ్, అఫ్సర్, ఖాజా, క్వాలిటీ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులు సమ సమాజ నిర్దేశకులు

విజయవాడ కల్చరల్: అధ్యాపకులు సమసమాజ నిర్దేశకులని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, జీఆర్‌కే, పోలవరపు సాహితీ పీఠం, పద్మశ్రీ ఘంటసాల చైతన్యవేదిక ఆధ్వర్యంలో కొత్తా పూర్ణానందం కళావేదికపై బుధవారం మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి నిర్వహించారు. నారాయణరావు, శ్రీ కళాభారతి అధ్యక్షుడు చంద్రశేఖర్, సాంస్కృతిక కళా సంస్థల ఐక్య వేదిక అధ్యక్షుడు ఆంజనేయరాజు మాట్లాడారు.

ఏకేటీపీ విద్యార్థినికి ట్రిపుల్ ఐటీలో సీటు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వెంకటేశ్వరనగర్‌కు చెందిన ఏకేటీపీ నగరపాలక సంస్థ పాఠశాల విద్యార్థిని వానపల్లి శ్యామ్ దుర్గాభవాని ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. పదో తరగతిలో 565 మార్కులు సాధించిన దుర్గాభవానికి ఎస్‌సీసీ కోటాలో ట్రిపుల్ ఐటీ సీటు వచ్చింది. అతి సాధారణ కుటుంబానికి చెందిన శ్యామ్ దుర్గాభవాని తండ్రి నూకరాజు టైలర్, తల్లి గృహిణి. విద్యార్థిని అందరూ అభినందించారు.

బతుకు బండి నడిపేదెలా?

- కోలుకోలేని దెబ్బతీసిన బుడమేరు
- చిరు వ్యాపారి కుమార్ ఆవేదన

విజయవాడస్పోర్ట్స్: బుడమేరు వరద చిరు వ్యాపారులను కోలుకోలేని దెబ్బతీసిందని వాంబేకాలనీకి చెందిన చిరువ్యాపారి కుమార్ వాపోతున్నారు. కుమార్ సింగ్‌నగర్, పైపుల రోడ్డు ప్రాంతాల్లో తోపుడు బండిపై చెప్పులు, షూ, పలు రకాలైన ఫ్యాన్సీ వస్తువులు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ముందస్తు హెచ్చరిక లేకపోవడంతో యథావిధిగా వ్యాపారం ముగిశాక శనివారం రాత్రి ఇంటి బయటే తోపుడు బండి ఉంచానని, ఆదివారం తెల్లవారుజామున అకస్మాత్తుగా వచ్చిన వరదలో బండిపై ఉన్న చెప్పులు, షూలు, ఫ్యాన్సీ వస్తువులన్నీ కొట్టుకుపోయాయని చెబుతూ కన్నీటి పర్యంతమయ్యాడు. బండిపై మిగిలిన కొద్దిపాటి షూ బురదమయం అయిందని వాపోయాడు. వరద నీరు తగ్గటంతో షూలను శుభ్రం చేసుకుని గుట్టగా పోసుకుంటూ తనకు జరిగిన నష్టాన్ని తలుచుకుంటూ కంట తడి పెట్టుకుంటున్నాడు. రూ.30 వేలకు పైబడి వస్తువులు పోయినట్లు చెబుతున్నాడు.


వరదలో కొట్టుకు పోగా మిగిలిన వస్తువులను శుభ్రం చేసుకుని గుట్టగా పోస్తున్న కుమార్

తప్పని వరద కష్టాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వరద ముంపు కొద్ది కొద్దిగా తగ్గుతున్నప్పటికీ బాధితులకు కష్టాలు తప్పటం లేదు. ప్రజల అవసరాలు, కష్టాలను ఆసరాగా చేసుకుని అందినకాడికి దండుకుంటున్నారు. వరద నీటిలో తాగునీరు, ఆహారం లేక అల్లాడిన బాధితులను ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు వరద నీటిలో అల్లాడిన బాధితులు వరద తగ్గుముఖం పట్టడంతో రోడ్లపైకి వస్తున్నారు. వరదలోంచి సురక్షిత ప్రాంతాలకు తరలించమని అడిగితే బోటు వారు రూ.2వేల నుంచి రూ.5వేల వరకు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే వరద ముంపుతో సర్వం కోల్పోయిన బాధితులు వరద నీటిలోనే నడుచుకుంటూ రామకృష్ణాపురం వరకు చేరుకుంటున్నారు. రామకృష్ణాపురం వచ్చిన తరువాత బుడమేరు వంతెన నుంచి ఫుడ్ జంక్షన్ వరకు ఆటోలు రూ.250, రైల్వేస్టేషన్, రామవరప్పాడు సెంటర్‌కు రూ.350 డిమాండ్ చేస్తున్నారు. అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని చెబుతున్న అధికారులు ఎక్కడ ఫిర్యాదు చేయాలో చెప్పటం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వరద బాధితులను ఆదుకోవాలని కోరుతున్నారు.


వరద నీటిలో పడవల్లో సురక్షిత ప్రాంతాలకు తరలి వెళుతున్న బాధితులు

ముంపు నుంచి తేరుకున్న పోలీస్‌స్టేషన్‌లు

విజయవాడస్పోర్ట్స్: అజిత్‌సింగ్‌నగర్, నున్న, గుణదల, కొత్తపేట పోలీస్ స్టేషన్‌లతో పాటు పాయకాపురంలోని ఫైర్ స్టేషన్ ముంపు బారి నుంచి బుధవారం తేరుకున్నాయి. బుడమేరు వరద ఈ స్టేషన్‌లను మూడు రోజుల పాటు ముంచింది. ఆరు అడుగుల ఎత్తులో నీరు స్టేషన్‌లలో ప్రవహించింది. దీంతో ఫర్నిచర్ పాక్షికంగా దెబ్బతినగా, పలు దస్త్రాలు నీటిలో నానాయి. వరద ముంపు నుంచి బయట పడటంతో స్టేషన్‌లోని గదులను, పరిసరాలను శుభ్రం చేసే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు.

మానవత్వం చాటుకున్న కానూరు వాసులు

లక్ష్మీపురం(గుంటూరు): వరద ముంపు ప్రాంతాలైన సింగ్ నగర్ లూనా సెంటర్ అంతర్గత వీధుల్లో ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయక చర్యలూ లేకపోవడంతో గత మూడు రోజుల నుంచి అనేకమంది బాధితులు కనీసం భోజనం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కానూరు డీఎస్ఆర్ రంగా బొమ్మ సెంటర్ ప్రాంతానికి చెందిన రామకృష్ణ అనే వ్యక్తి స్థానికులతో కలిసి తలాకొంత నగదు వేసుకొని రెండు రోజులుగా ఈ ప్రాంతంలో అన్నదానం చేస్తున్నారు. ప్రభుత్వం ఎలాంటి సహాయక చర్యలు చేయకపోయినప్పటికీ ఇటువంటి మానవత్వం ఉన్న వారు బాధితుల కోసం ఇంటి వద్ద నుంచి భోజనాలను వండుకొని రావడం అభినందనీయమని స్థానికులు కొనియాడుతున్నారు.